
సాక్షి
పల్నాడు
మంగళవారం । 27 । జూన్ । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 519.80 అడుగుల వద్ద ఉంది. ఇది 148.9116 టీఎంసీలకు సమానం.



హుండీ లెక్కింపు రేపు

పెదకాకాని: భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు బుధవారం జరుగుతుందని దేవస్థాన సహాయ కమిషనర్ ఎన్.శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు.



దుర్గమ్మ సేవలో జస్టిస్ సుజాత

విజయవాడ: ఆషాఢ మాసోత్సవాలను పురస్కరించుకుని విజయవాడ దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత సోమవారం దర్శించుకున్నారు. సారె సమర్పించారు.

టీడీపీ బస్సుయాత్ర తుస్సు

సొంత పార్టీలోనే స్పందన కరువు

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిర్మించిన జేఎన్టీయూ ముందు సెల్ఫీ తీసుకొని నవ్వులపాలైన తెలుగు తమ్ముళ్లు
- కోడెల శివప్రసాద్ ఘాట్ మీదుగా వెళ్లినా నివాళులు అర్పించని నేతలు
- ఆగ్రహించి యాత్రను అడ్డుకున్న కోడెల అభిమానులు
- వేర్వేరుగా యాత్రలో పాల్గొన్న అరవింద్ బాబు, కడియాల, నల్లపాటి వర్గాలు
- ఏ మాత్రం పట్టించుకోని ప్రజలు



నరసరావుపేట పట్టణంలో జనం లేకుండా సాగుతున్న టీడీపీ భవిష్యత్తుకు గ్యారెంటీ బస్సుయాత్ర

సాక్షి, నరసరావుపేట: మోసపూరిత హామీలతో మరోసారి అధికారం చేపట్టడానికి తెలుగుదేశం పార్టీ చేపట్టిన భవిష్యత్తుకు గ్యారెంటీ బస్సు యాత్ర తొలి రోజే నరసరావుపేటలో తుస్సుమంది. ఐదు రోజుల పల్నాడు జిల్లా పర్యటన సోమవారం నరసరావుపేట నియోజకవర్గంలో ప్రారంభమైంది. 2014 ఎన్నికల్లో గెలుపొందడం కోసం వందలాది హామీలు ఇచ్చి, వాటిని ఆచరణలో పెట్టకపోవడంతో 2019 ఎన్నికల్లో టీడీపీని ప్రజలు ఘోరంగా ఓడించారు. జనాగ్రహం ఇప్పటివరకు తగ్గలేదన్నది తాజాగా టీడీపీ బస్సు యాత్రలోనూ రుజువైంది. ఎన్నికలు సమీపిస్తుండటంతో తొలి మేనిఫెస్టో ప్రచారం పేరిట చేస్తున్న యాత్రపై ఎక్కడా ప్రజలు ఆసక్తి చూపలేదు. నిన్ను నమ్మం బాబు అంటూ గళమెత్తుతున్నారు. యాత్రలో టీడీపీ నేతలు ఆలపాటి రాజా, తెనాలి శ్రావణ్‌కుమార్, ప్రత్తిపాటి పుల్లారావు, జీవీ ఆంజనేయులు, జూలకంటి బ్రహ్మారెడ్డి, చదలవాడ అరవింద్‌బాబు, కడియాల వెంకటేశ్వరరావు, నల్లపాటి రాము, యరపతినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో వర్గపోరు

బస్సు యాత్ర సందర్భంగా నరసరావుపేటలో వర్గపోరు బయటపడింది. టికెట్ ఆశిస్తున్న చదలవాడ అరవింద్‌బాబు, కడియాల వెంకటేశ్వరరావు, నల్లపాటి రాము వర్గాలు ఎవరికి వారు ప్రత్యేకంగా పార్టీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇన్‌చార్జి తాను కాబట్టి యాత్ర తన ఆస్పత్రి నుంచి ప్రారంభం కావాలని చదలవాడ, లేదు తన ఆస్పత్రి నుంచి ప్రారంభం కావాలని కడియాల వెంకటేశ్వరరావు పట్టుబట్టినట్టు తెలుస్తోంది. మరోవైపు టిడ్కో ఇళ్ల వద్ద నల్లపాటి రాము పంచిన కరపత్రాలలో చంద్రబాబు, తన ఫొటోలు మాత్రమే ముద్రించగా, నియోజకవర్గ ఇన్‌చార్జి చదలవాడ తన ఫొటోలు లేవని అక్కడున్న నేతలకు ఫిర్యాదు చేశారట. ఈ ముగ్గురితోపాటు మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ వర్గం కోడెల కుటుంబానికి పార్టీ అన్యాయం చేస్తోందంటూ ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం

ప్రహరీ సైతం కట్టనివారు సెల్ఫీలా!

కాకాని గ్రామ పరిధిలోని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలను వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మంజూరు చేశారు. ఈ కళాశాల కోసం 85.94 ఎకరాల భూమిని గుర్తించారు. 2016లో జేఎన్టీయూ కళాశాల భవనాల నిర్మాణం జరగకపోవడంతో తాత్కాలిక అద్దెభవనాలలో తరగతులు ప్రారంభించారు. కాకానిలో కేటాయించిన స్థలానికి ప్రహరీ నిర్మాణానికి 2017లో రూ.3 కోట్లు కేటాయించి పనులు చేపట్టారు. 2018 ఫిబ్రవరి 17న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కళాశాల భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేసి వదిలేశారు. ఐదేళ్ల టీడీపీ ప్రభుత్వ హయాంలో కనీసం ప్రహరీ పనుల్లో 10 శాతం కూడా పూర్తి చేయలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే జేఎన్టీయూ సొంత భవనాల నిర్మాణం పురోగతిలోకి వచ్చింది. తొలుత ఐదేళ్ల టీడీపీ ప్రభుత్వ కాలంలో పూర్తికాని ప్రహరీ నిర్మాణాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తొలి ఆరు నెలల్లోనే పూర్తి చేసింది. ఆగస్టు 17, 2020న రూ.150 కోట్ల అంచనాలతో భవనాల నిర్మాణం ప్రారంభించారు. అప్పటి నుంచి పనులు పరుగులు పెట్టాయి. రెండు అకడమిక్ బ్లాక్‌లు, ఓ అడ్మిస్ట్రేషన్ బ్లాక్, హాస్టల్ పనులు దాదాపు పూర్తికావొచ్చాయి. విషయం తెలిసిన టీడీపీ ద్వితీయశ్రేణి నాయకులు బస్సు యాత్ర షెడ్యూల్‌లో జేఎన్టీయూ కళాశాలను తీసేయాలని ఆదివారం రాత్రి పట్టుబట్టినా అప్పటికే షెడ్యూల్ ప్రకటించి ఉండటంతో అభాసుపాలవుతామని టీడీపీ నేతలు మిన్నకున్నారు. సోమవారం కళాశాల ముందు సెల్ఫీలు దిగి నవ్వులపాలయ్యారు.

కోడెలకు అవమానం

బస్సు యాత్ర కోటప్పకొండ సమీపంలోని మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు ఘాట్ మీదుగా వెళ్లినా టీడీపీ నేతలు ఆయనకు నివాళి అర్పించే యత్నం చేయలేదు. బస్సు ఆపకుండా ముందుకు సాగుతుండగా కోడెల అభిమానులు ఆగ్రహించారు. పార్టీ కోసం చివరి శ్వాస వరకు పోరాడిన కోడెలకు అడుగడుగునా అవమానాలు ఎదురవుతున్నాయంటూ బస్సు యాత్రను అడ్డుకున్నారు. బస్సుకు అడ్డుగా నిలిచారు. బస్సులో ఉన్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఇతర నేతలు వారిని పక్కకు పంపి కనీసం బస్సు దిగకుండా ముందుకు వెళ్లిపోవడం కోడెల అభిమానులను కలచివేసింది. బస్సు వెనక కారులో వస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కారు దిగి కోడెల విగ్రహానికి పూలమాల వేసి ఆయన అభిమానులను బుజ్జగించే యత్నం చేశారు.

ప్రభుత్వ అనుమతితో తవ్వుతున్న క్వారీ ముందు సెల్ఫీలు

కోటప్పకొండ సమీపంలోని చిలకలూరిపేట మేజర్ కెనాల్ పక్కన ప్రభుత్వ అనుమతితో తవ్వుతున్న క్వారీ ముందు టీడీపీ నేతలు సెల్ఫీలు తీసుకున్నారు. అక్రమ మైనింగ్ జరుగుతోందని, స్థానిక ఎమ్మెల్యే బాధ్యుడంటూ ఆరోపణలు చేశారు. అయితే ఈ క్వారీలో మట్టిని సమీపంలో ఉన్న జేఎన్‌టీయూ కళాశాల రోడ్ల నిర్మాణానికి వినియోగించారని తెలిసి కూడా రాజకీయం చేసే యత్నం చేశారు. ఈ క్వారీకి ఆనుకొని టీడీపీ హయాంలో పెద్ద ఎత్తున అక్రమంగా తవ్వకాలు జరిపిన గుంతలు ఉన్నప్పటికీ అటువైపు చూడకపోవడం ఆశ్చర్యకరం. యాత్రలో ఉన్న కొంతమంది తెలుగు తమ్ముళ్లు భారీ లోతు ఉన్న ఆ క్వారీల వైపు వెళదామని చెప్పగా, నేతలు వారించినట్టు తెలుస్తోంది.

ముఖ్యనేతల డుమ్మా

బస్సు యాత్ర తొలి రోజు పల్నాడు జిల్లాకు చెందిన పలువురు ముఖ్యనేతలు హాజరుకాలేదు. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, కొమ్మాలపాటి శ్రీధర్ వంటి నియోజకవర్గ ఇన్‌చార్జిలు కూడా డుమ్మా కొట్టడం చర్చనీయాంశమైంది. కోడెల శివరాంకు యాత్రలో పాల్గొనాలని ఆహ్వానం అందిందా లేదా అన్న చర్చ కార్యకర్తల్లో జరిగింది. మరోవైపు తెలుగుదేశం కార్యకర్తలూ అంతగా హాజరుకాలేదు. కోటప్పకొండ క్వారీ వద్ద సెల్ఫీ చాలెంజ్ సమయంలో ఓ ఇరవై మంది మాత్రమే కనిపించారు. యాత్ర పొడవునా ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై బురదజల్లే విమర్శలు చేయడమే పనిగా టీడీపీ నేతలు పెట్టుకున్నారు.

న్యూస్‌రీల్

విత్తన దుకాణాల్లో తనిఖీలు



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరులోని రాజాగారితోట, పట్నంబజారు, ఏటుకూరు రోడ్ ప్రాంతాల్లోని పలు విత్తన దుకాణాల్లో వ్యవసాయశాఖ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి సోమవారం తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో సరైన అనుమతి పత్రాలు చూపని కారణంగా రూ.26,25,937 విలువ గల 136.80 కిలోల మిరప, పత్తి, కూరగాయల విత్తనాల అమ్మకాలు నిలిపి వేశారు. ఏడీఏ సీహెచ్ సునీత మాట్లాడుతూ విత్తనాలను ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలకు అమ్మినట్లయితే కేసులు నమోదు చేసి లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. అధిక ధరలకు విత్తనాలను విక్రయించినట్లు రైతుల నుంచి ఫిర్యాదులు అందితే దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతి రైతు విత్తనం కొనుగోలు చేసిన తర్వాత రశీదు తప్పనిసరిగా పొందాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలను డీలర్లు తప్పక పాటించాలని ఆదేశించారు. తనిఖీల్లో ఏడీఏ టి.శ్రీనివాసరావు, సీహెచ్ తిరుమలాదేవి, ఏఓలు బి.అంజిరెడ్డి, బి.కిషోర్, ఐ.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అయ్యవార్ల 'అతి'క్రమణపై ఆగ్రహం

సాక్షి ఎఫెక్ట్

తెనాలి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్ల విషయంలో ప్రధానోపాధ్యాయులు చేస్తున్న అతిపై సోమవారం డీఈఓ శైలజ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని మున్సిపల్ హైస్కూళ్లలో చేరేందుకు వస్తున్న విద్యార్థులతో ఇంగ్లిష్ పాఠం చదవమనటం, ఎవరైనా చదవలేకపోతే అడ్మిషన్లు నిరాకరిస్తూ కొందరు ప్రధానోపాధ్యాయులు సొంత రూల్స్ అమలు చేస్తున్న నేపథ్యంలో 'అయ్యవార్ల అతిక్రమణ' శీర్షికన సోమవారం 'సాక్షి' గుంటూరు జిల్లా ఎడిషన్‌లో ప్రచురితమైన కథనానికి జిల్లా విద్యాశాఖాధికారి శైలజ స్పందించారు. ఆమె ఆదేశాల మేరకు తెనాలి ఉప విద్యాశాఖాధికారి నిర్మల, మండల విద్యాధికారి డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ విచారణ జరిపారు. సొంత నిబంధనలు అమలుచేస్తున్న ప్రధానోపాధ్యాయుడిని గుర్తించి, లిఖితపూర్వక సంజాయిషీ అడిగారు. నిబంధనల ప్రకారం అడ్మిషన్ కోరి వచ్చిన విద్యార్థులను చేర్చుకోవాలని స్పష్టంచేశారు. ఇలాంటివి పునరావృతం కారాదని హెచ్చరించారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.3.54 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు భక్తులు హుండీల ద్వారా రూ.3.54 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడుల రూపంలో సమర్పించారు. ఆది దంపతులకు భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలు, మొక్కుబడులు, ముడుపులను సోమవారం మహా మండపం ఆరో అంతస్తులో లెక్కించారు. 20 రోజులకు రూ.3,54,87,284 నగదు, 666 గ్రాముల బంగారం, 7.752 కిలోల వెండి సమకూరిందని ఆలయ ఈఓ భ్రమరాంబ తెలిపారు. రోజుకు సరాసరిన రూ.17.74 లక్షల ఆదాయం హుండీల ద్వారా వచ్చిందని పేర్కొన్నారు. కానుకల లెక్కింపును పాలక మండలి సభ్యులు చింకా శ్రీనివాసులు, బచ్చు మాధవీకృష్ణ, దేవదాయ శాఖ అధికారులు అనురాధ, పోలీసులు, ఎస్‌పీఎఫ్ సిబ్బంది పర్యవేక్షించారు. ఇక ఈ హుండీ ద్వారా రూ.36,153 విరాళాలను భక్తులు సమర్పించారు.

38,882 మిర్చి బస్తాల రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 38,882 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 36,599 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.25,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాలుకు రూ.9,500 నుంచి 23,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ. 13,500 నుంచి రూ. 25,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. యార్డులో ఇంకా 14,641 బస్తాలు మిర్చి నిల్వ ఉంది.

తొలి ఏకాదశి తిరునాళ్లపై కలెక్టర్ సమీక్ష



కొండపై ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్ ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ(నూజెండ్ల) : తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని వినుకొండ కొండపై ఈనెల 29న జరిగే తిరునాళ్లను జయప్రదం చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివ శంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి చెప్పారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి అధికారులతో కలెక్టర్, ఎస్పీ సోమవారం కొండపై సమీక్ష సమావేశం నిర్వహించారు. తిరునాళ్లకు 2 లక్షలమందికిపైగా భక్తులు తరలిరానుండటంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. బందోబస్తును పకడ్బందీగా చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. ఆర్టీసీ బస్సులను కొండపైకి నడపాలని, ప్రైవేటు వాహనాలకు అనుమతి లేదని పేర్కొన్నారు. కొండపై హిమాలయ బాబా సమక్షంలో ఏర్పాటు చేసిన అఖండ జ్యోతి ప్రజ్వలన ఏర్పాట్లను పరిశీలించారు. ఎమ్మెల్యే బొల్లా, మాజీ ఎమ్మెల్యే మక్కెన మాట్లాడుతూ తిరునాళ్లకు 15 భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ టి.సత్యనారాయణ, ఈఓ కె.హనుమంతరావు, డీఎస్పీ కె.మహేష్, మున్సిపల్ కమిషనర్ వెంకయ్య, తహసీల్దార్ కిరణ్‌కుమార్, మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లుయాదవ్, కౌన్సిలర్ షకీలా దస్తగిరి, మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండు చెన్నయ్య పాల్గొన్నారు.



ఆపరేషన్ విజయవంతం కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్న డాక్టర్ గోఖలే బృందం

సర్కారు సహృదయం

- సహృదయ ట్రస్టు ద్వారా జీజీహెచ్‌లో బైపాస్ సర్జరీలు
- నాటి ప్రభుత్వ నిర్దయతో ఆగిన శస్త్రచికిత్సలు
- సంక్షేమ పాలకుని కృషితో ప్రారంభం
- గుంటూరు జీజీహెచ్‌లో డాక్టర్ గోఖలే సేవలు అందుబాటులోకి..



బైపాస్ సర్జరీ చేస్తున్న డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే బృందం

గుంటూరు మెడికల్: సంక్షేమ సర్కారు పేదల గుండెధైర్యమై నిలిచింది. గత ప్రభుత్వ నిర్దయతో ఆగిన గుండె శస్త్రచికిత్సలను మళ్లీ పునఃప్రారంభించింది. 600పైగా సర్జీలు, నాలుగు గుండె మార్పిడి శస్త్రచికిత్సలతో సరికొత్త అధ్యాయాన్ని లిఖించిన అపర సంజీవని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే చొరవతో మళ్లీ రోగుల గుండెల్లో సంతోషాలు పూయించి తన కీర్తిపతాకను సగర్వంగా రెపరెపలాడించేందుకు సిద్ధమైంది.

టీడీపీ ప్రభుత్వంలో కునారిల్లి..

గుంటూరు జీజీహెచ్ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వసతుల్లేక కునారిల్లింది. ఆస్పత్రిలో పసికందును ఎలుక కొరికిన ఘటన మాయని మచ్చగా, అప్పటి ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనంగా నిలిచింది. ఆస్పత్రిపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లేలా చేసింది. ఈ క్రమంలో 2019లో అధికారం చేపట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్ద పీట వేశారు. వైద్య సిబ్బంది నియామకం, నూతన వైద్య పరికరాల కొనుగోలు ద్వారా జీజీహెచ్‌కు ఊపిరిపోశారు. దీంతో రోజుకు నాలుగువేలకుపైగా ఓపీతో రాష్ట్రంలో అత్యుత్తమ వైద్యశాలగా గుర్తింపు పొందింది.

విన్నవించినా పట్టించుకోని గత ప్రభుత్వం

ఎలుక కొరికి పసికందు మృత్యువాత పడిన ఘటనతో అప్రతిష్టపాలైన గత ప్రభుత్వం తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు సహృదయ ట్రస్టును పావుగా వినియోగించుకుంది. 2015లో సహృదయ ట్రస్టు ద్వారా జీజీహెచ్‌లో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించేందుకు గుండె మార్పిడి సర్జన్ డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే ముందుకు రావడంతో మూడేళ్లపాటు 2018 వరకు సేవలు అందించేందుకు ఉత్తర్వులిచ్చింది. దీనివల్ల అప్పటివరకు ఉన్న అపఖ్యాతిని పోగొట్టుకోవాలని కుయుక్తి పన్నింది. సేవలు ఆరంభించిన డాక్టర్ గోఖలే సుమారు 600కుపైగా బైపాస్ సర్జరీలు, నాలుగు గుండె మార్పిడి సర్జరీలు నిర్వహించారు. సహృదయ ట్రస్టుతో కుదుర్చుకున్న ఒప్పందం ముగిసినా డాక్టర్ గోఖలే అదనంగా 11 నెలలపాటు ఉచితంగా సేవలందించారు. తమ ట్రస్టు సేవలను పొడిగించాలని గత టీడీపీ ప్రభుత్వానికి విన్నవించారు. అయినా అప్పటి ప్రభుత్వం స్పందించలేదు. దీంతో గోఖలే జీజీహెచ్ వదిలి వెళ్లిపోయారు. అప్పటి నుంచి గుండె ఆపరేషన్లు నిలిచిపోయాయి. మళ్లీ ఇప్పుడు సంక్షేమ సర్కారు చొరవతో ఆపరేషన్లు ప్రారంభమయ్యాయి. సోమవారం డాక్టర్ గోఖలే ఆధ్వర్యంలో వైద్యులు గుంటూరుకు చెందిన రోగి కిషోర్‌కు తొలి బైపాస్ సర్జరీ దిగ్విజయంగా పూర్తిచేశారు.

రెగ్యులర్‌గా బైపాస్ సర్జరీలు

గుంటూరు జీజీహెచ్‌లో ప్రతివారం రెగ్యులర్‌గా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా గుండె బైపాస్ సర్జరీలు చేస్తాం. రాష్ట్ర ప్రభుత్వం గుంటూరు జీజీహెచ్, రాష్ట్రంలోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులకు శిక్షణ ఇవ్వడంతోపాటు, సర్జరీలు చేసేందుకు తమకు ప్రత్యేక అనుమతులు ఇచ్చింది. సర్జరీలు రెగ్యులర్‌గా జరిగేలా జీజీహెచ్ వైద్యులకు శిక్షణ ఇస్తాను. గతంలో గుండె మార్పిడి ఆపరేషన్లు చేయించుకున్న ఏడుకొండలు, హరిబాబుకు ప్రతినెలా రూ.3 లక్షల ఖరీదు చేసే మందులు సహృదయ ట్రస్టు ద్వారా ఉచితంగా అందిస్తున్నాం. పేదలు సేవలను వినియోగించుకోవాలి.

– డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే

అమ్మఒడి శుభ'మనీ'

రేపు నాలుగో విడత ఆర్థిక లబ్ధి

- గుంటూరు జిల్లాలో ఎంపికైన 1,59,594 మంది మాతృమూర్తులు
- రూ.239.39 కోట్ల ఆర్థిక లబ్ధి చేకూర్చనున్న ప్రభుత్వం
- గ్రామ, వార్డు సచివాలయాల వారీగా జాబితాల ప్రదర్శన
- తల్లులచే బయోమెట్రిక్ అథంటిఫికేషన్ నమోదు చేయిస్తున్న వలంటీర్లు
- రేపు జిల్లాస్థాయిలో కార్యక్రమం
- ఈనెల 30 నుంచి మండలాల వారీగా జగనన్న అమ్మఒడి కార్యక్రమాలు



గుంటూరు ఎడ్యుకేషన్: పిల్లలను పాఠశాలలకు పంపుతున్న తల్లులకు జగనన్న అమ్మఒడి నాలుగో విడత ఆర్థిక లబ్ధిని ప్రభుత్వం ఈనెల 28న బుధవారం అందించనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు క్షేత్రస్థాయిలో తుది దశకు చేరాయి. గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న విద్యార్థుల్లో అర్హులను గుర్తించి, ఎంపిక చేసిన ప్రభుత్వం వారి మాతృమూర్తుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనుంది. ఇప్పటికే అమ్మఒడి అర్హుల జాబితాలను ప్రభుత్వ ఆదేశాలతో గ్రామ, వార్డు సచివాలయాల్లో అధికారులు ప్రదర్శిస్తున్నారు. ఈ ఏడాది మొత్తం 1,59,594 మంది మాతృమూర్తులకు రూ.15వేల చొప్పున రూ.239.39 కోట్ల ఆర్థిక ప్రోత్సాహాన్ని సర్కారు అందించనుంది. లబ్ధిదారుల జాబితాలను ఈనెల 28న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో జగనన్న అమ్మఒడి నాలుగో విడత కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి, తల్లుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. అలాగే గుంటూరు జిల్లాకు సంబంధించిన అధికారిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదే విధంగా ఈనెల 30 నుంచి మండలాల వారీగా పాఠశాలల్లో జగనన్న అమ్మఒడి కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

గుంటూరు జిల్లాలో నాలుగేళ్లలో అమ్మఒడి ఆర్థిక లబ్ధి ఇలా(రూ.కోట్లలో)

విద్యాసంవత్సరం	తల్లుల సంఖ్య	ఆర్థిక లబ్ధి
2019-20	1,46,232	219.34
2020-21	1,55,330	232.99
2021-22	1,64,601	246.90
2022-23	1,59,594	239.39

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

అమ్మఒడి ఆర్థిక ప్రయోజనాన్ని అందుకునేందుకు ఉద్దేశించిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా నిర్వహించింది. గ్రామ, వార్డు సచివాలయాల వారీగా వలంటీర్లు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి, అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేశారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ ప్రభుత్వం అందించే లబ్ధికి దూరం కాకూడదనే సదుద్దేశంతో ఎంతో పారదర్శంగా నిర్వహించారు. వలంటీర్లు తమ పరిధిలోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి, మాతృమూర్తులతో బయోమెట్రిక్ అథంటిఫికేషన్ నమోదు చేస్తున్నారు. సోమవారం రాత్రికి ఈ ప్రక్రియ పూర్తికానుంది.

వార్డు సచివాలయ కార్యదర్శుల బదిలీలు



పాత గుంటూరు: రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు వార్డు సచివాలయ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ చేపట్టామని మున్సిపల్ రీజినల్ డైరెక్టర్(ఆర్డీ) శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వార్డు కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. ఆర్డీ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని వార్డ్ అడ్మిన్, వెల్ఫేర్, డేటా ప్రాసెసింగ్ అండ్ ఎడ్యుకేషన్, శానిటేషన్, ప్లానింగ్, ఎమినిటి కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్ చేపట్టామని పేర్కొన్నారు. ఇంటర్ డిస్ట్రిక్ట్ స్పౌజ్, మ్యూచువల్, విత్ ఇన్ డిస్ట్రిక్ట్ అదర్స్ కేటగిరిలో అంశాల ప్రాధ్యాన్యంగా బదిలీలు జరిగాయని పేర్కొన్నారు. ఇంటర్ డిస్ట్రిక్ట్ స్పౌజ్ 38, ఇంటర్ డిస్ట్రిక్ట్ మ్యూచువల్ 70, అదర్స్ విభాగంలో 210 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారికి బదిలీ ఆమోద ఆర్డర్ అందించినట్టు వివరించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్లు బి. శ్రీనివాసరావు, సి.హెచ్.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, మేనేజర్ శివన్నారాయణ, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

స'లా'ం నేస్తం



యువ న్యాయవాదులకు నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్

- అట్టహాసంగా వైఎస్సార్ లా నేస్తం జమ
- 91 మంది న్యాయవాదులకు లబ్ధి
- రూ.22.75 లక్షల మేర ప్రయోజనం

నరసరావుపేట: లా గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన అర్హులైన యువ న్యాయవాదులు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం (స్టైఫండ్) సద్వినియోగం చేసుకుని వృత్తిలో పురోగతి సాధించాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆకాంక్షించారు. సోమవారం 2023-2024 ఏడాదికి మొదటి విడత వైఎస్సార్ లా నేస్తం స్టైఫండ్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లబ్ధిదారులతో కలిసి కలెక్టర్ వర్చువల్ విధానంలో వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది మొదటి విడతగా ఫిబ్రవరి 2023 నుంచి జూన్ 2023 వరకు ఐదు నెలలకు నెలకు రూ.5వేలు చొప్పున జిల్లాలో 91 మందికి రూ.25 వేలు చొప్పున రు.22.75 లక్షల సొమ్మును లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసినట్టు వివరించారు. లా డిగ్రీ పూర్తి చేసి న్యాయవాద వృత్తిలోకి అడుగుపెట్టిన వారికి మూడేళ్లపాటు వారికి ఆర్థిక లబ్ధి చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ లా నేస్తం పథకాన్ని ప్రవేశ పెట్టిందని పేర్కొన్నారు. నెలకు రూ.5 వేలు చొప్పున ఏడాదికి రూ.60 వేలు, అలాగే మూడేళ్లకు రూ.1.80లక్షల చొప్పున సాయం అందుతుందని వివరించారు. న్యాయవాదులు వృత్తిలో ఎదగాలని పేర్కొన్నారు.

రీసర్వే పనులు సత్వరం పూర్తిచేయండి

జేసీ శ్యాంప్రసాద్

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం రీ-సర్వే పనులను సత్వరం పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ ఆదేశించారు. పట్టణంలోని మున్సిపల్ అతిథి గృహంలో రీ-సర్వే పనులకు సంబంధించి నరసరావుపేట, గురజాల, మాచవరం, రెంటచింతల, నాదెండ్ల, చిలకలూరిపేట, నూజెండ్ల మండలాలకు చెందిన రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో రీ-సర్వే పనులు నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం, అనుకున్న లక్ష్యం మేరకు పూర్తిచేయాలన్నారు. సమావేశంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ వసంతబాబు, ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి పాల్గొన్నారు.

సంచుల షార్ట్ టెండర్లకు ఆహ్వానం

నరసరావుపేట: వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్‌కిట్లను జిల్లాలోని అంగన్‌డీ కేంద్రాలకు సరఫరా చేసేందుకు కావాల్సిన సంచుల కోసం షార్టు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్, కొనుగోలు కమిటీ చైర్మన్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని తొమ్మిది ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పోషకాహార కిట్లను పంపిణీ చేసేందుకు సంచులు అవసరం ఉందని పేర్కొన్నారు. టెండర్ వివరాలపై ఆసక్తి ఉన్న వారు బరంపేట బీసీ కాలనీ, చాకిరాల మిట్టలోని జిల్లా మహిళా, శిశుసంక్షేమ సాధికారిత అధికారి, సెల్ నంబరు 94910 51603 ఈనెల 30వ తేదీలోగా సంప్రదించాలని కోరారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట రూరల్: మాదకద్రవ్యాలపై యువత అప్రమత్తంగా ఉండి వీటికి దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి కోరారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలో 144 దేశాల్లో మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం మెట్రోపాలిటీ నగరాల నుంచి అన్ని పట్టణాలకు విస్తరిస్తుందన్నారు. జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ యువత కొత్త పరిచయాల ద్వారా చెడు వ్యసనాలకు దగ్గరవుతారని తెలిపారు. డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలకు బానిసలై దొంగతనాలు, చైన్‌స్నాచింగ్ ఇతర నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. డ్రగ్స్ వాడకం వలన ఆరోగ్యపరంగా, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. యువత భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని మాదక ద్రవ్యాలను పూర్తిగా తుదిముట్టించాలన్నారు. డ్రగ్స్ విక్రయించేవారు, రవాణా చేసేవారు, వినియోగించే వారిపై పూర్తిగా నిఘా ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు, కళాశాల కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు, ఎస్ఈబీ ఈఎస్ చంద్రశేఖరరెడ్డి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎస్ఈబీ ఏఈఎస్ దుర్గాప్రసాద్, డీఎస్పీ కేవీ మహేష్, రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసకుమార్ పాల్గొన్నారు.



మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

నెడ్‌క్యాప్ ఎలక్ట్రికల్ బైక్‌ల ప్రదర్శన

నరసరావుపేట: జిల్లాలో వాయు, శబ్ద కాలుష్య నియంత్రణకు విద్యుత్ వాహనాలు దోహదం చేస్తాయని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో న్యూ అండ్ రీయూజబుల్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఏపీ (ఎన్ఆర్ఈడీసీఏపీ) సంస్థ ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ ద్విచక వాహనాల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. విద్యుత్ ద్విచక్రవాహనాల చార్జింగ్ వివరాలను తెలుసుకున్నారు. ఒక వాహనంపై ఎక్కి టెస్టింగ్ డ్రైవింగ్ చేశారు. నెడ్‌క్యాప్ గుంటూరు ఉమ్మడి జిల్లా అధికారి వి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు మొదటి ఈఎంఐ మాత్రమే చెల్లించి వాహనాల కొనుగోలు చేయవచ్చన్నారు. తక్కిన మొత్తం ఈఎంఐల రూపంలో నెలనెలా చెల్లించవచ్చన్నారు. తమ నెడ్ క్యాప్ పోర్టల్ http://evnredcap.in ద్వారా వాహనం ఖరీదు చేస్తే బ్యాంకు వడ్డీరేటు కూడా తగ్గుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 0863-2350114, 98498 53818 సంప్రదించాలని కోరారు.



కలెక్టరేట్‌లో ప్రదర్శనగా ఉంచిన వాహనాలు, నెడ్‌క్యాప్ అధికారులతో జిల్లా కలెక్టర్ శివశంకర్

ఫిర్యాదుదారుల సమస్యలపై శ్రద్ధ పెట్టండి

- జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి
- జగనన్నకు చెబుదాంలో 52 ఫిర్యాదులు స్వీకరణ

నరసరావుపేట: ప్రతి ఫిర్యాదుదారుని సమస్యపై శ్రద్ధ వహించి నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వై.రవిశంకర్‌రెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కుటుంబ, ఆర్థిక, ఆస్తి వివాదాలపై 52 ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారులకు పట్టణానికి చెందిన శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానం కమిటీ కొత్తూరి వెంకట శివవేణుగోపాలరావు(గోపి) భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు, క్రైమ్ అదనపు ఎస్పీ ఎస్‌కే చంద్రశేఖర్, డీఎస్పీలు కె.వి.మహేష్, పల్లపురాజు, బి.ఆదినారాయణ, దిశ డీఎస్పీ యు.రవిచంద్ర పాల్గొన్నారు.



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ

ఇంటిలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారు..

సత్తెనపల్లి కోర్టు నిర్వహించిన బహిరంగ వేలంలో అచ్చంపేటలోని ఒక ఇంటిని వేలంలో దక్కించుకున్నా. ఆ ఇంటిని స్వాధీనం చేసుకునేందుకు వెళ్లగా కొందరు వ్యక్తులు అడ్డుపడి ఇంటిలోకి వెళ్లకుండా వికలాంగుడైన నాపై దౌర్జన్యం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేయాలని సలహా ఇచ్చారు. నన్ను బెదిరించిన వ్యక్తులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వినతి.

– వి.మదనమోహనరావు, దివ్యాంగుడు,తాడేపల్లి

నా చిన్నకుమారుడు ఇల్లు ఇవ్వట్లేదు

నాకు ఇద్దరు కుమారులు. నా భర్త చనిపోయాడు. 65 ఏళ్ల నాకు రెండు పెంకిటిల్లు ఉన్నాయి. చెరొక ఇల్లు ఇద్దరు కుమారులకు ఇచ్చి నేను చిన్నకుమారుడి వద్ద ఉండేదానిని. అయితే నన్ను సక్రమంగా చూడకపోవటంతో నేను ఒక ఇంటిలో ఉంటూ మరో ఇల్లు అద్దెకు ఇచ్చి వచ్చే సొమ్ముతో బతకాలనే ఉద్దేశంతో నా రెండిళ్లు నాకు ఇవ్వాలని కోరాను. పెద్ద కుమారుడు ఇల్లు ఖాళీ చేసి ఇచ్చాడు. చిన్న కుమారుడు ఖాళీ చేయకుండా నన్ను ఇబ్బంది పెడుతున్నాడు. నా చిన్నకుమారుడిపై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయండి.

–టి.సుబ్బాయమ్మ, వృద్ధురాలు, నరసరావుపేట టౌన్

నాపై దౌర్జన్యం

కాలనీలో నా ఇంటికి ఎదురుగా ఉండే కుటుంబం రోడ్డును అడ్డంగా తవ్వి వారి మురుగునీరు నా ఇంటిపైకి వచ్చే విధంగా చేశారు. ప్రశ్నించడంతో నాపై దౌర్జన్యం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దయచేసి వారిపై చర్యలు తీసుకుని నా కుటుంబానికి రక్షణ కల్పించాలి.

– వల్లపు లక్ష్మి, ఉప్పరపాలెం, యడ్లపాడు మండలం

నా భార్యను కొట్టారు

మూడేళ్ల క్రితం స్నేహితుని కోసం మరొక వ్యక్తి దగ్గర అడ్డం ఉండి రూ.3లక్షలు అప్పు ఇప్పించాను. డబ్బులు తీసుకున్న నా స్నేహితుడు రెండేళ్ల క్రితం చనిపోయాడు. ఆ డబ్బులు నేను ఇస్తానని చెప్పినప్పటికీ వినకుండా నేను ఇంటిలో లేని సమయంలో ఇంటికి వచ్చి నా భార్యను తిట్టి కొట్టారు. వారిపై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయండి.

–ఓ వ్యక్తి, పిడుగురాళ్ల

మహిళల ఆరోగ్యానికే ప్రాధాన్యం



మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: మహిళల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని దీనిని అధికారులు ముందుకు తీసుకెళ్లాలని గుంటూరు కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి అధికారులతో మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖలో అమలు చేస్తున్న పథకాలు సక్రమంగా అర్హులకు అందేలా చూడాలన్నారు. పీహెచ్‌సీల్లో రక్త హీనత పరీక్షలతోపాటు గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. పాఠశాలల్లో జేవీకే కిట్లు పంపిణీ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. నాడు-నేడు పథకంలో భాగంగా పాఠశాలల్లో జరుగుతున్న మరుగుదొడ్ల నిర్మాణాలు, విద్యుత్ సౌకర్యం, కిచెన్ షెడ్లు నిర్మాణం ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని చెప్పారు. విద్యార్థులకు ఎనీమియా స్క్రీనింగ్ పరీక్షలు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో రోగాలకు పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ శ్రావణ్ బాబు, డీఈఓ శైలజ, ఐసీడీఎస్ పీడీ మనోరంజని, సీపీఓ శేషశ్రీ, సమగ్రశిక్ష ఏపీసీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

పవర్‌లిఫ్టింగ్‌లో పల్నాడు జిల్లా వాసుల ప్రతిభ



రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనపరిచిన వారితో కోచ్ పసుపులేటి సురేష్

సత్తెనపల్లి(ముప్పాళ్ల): రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ అండ్ బెంచ్ ప్రెస్ సీనియర్ మెన్ మరియు ఉమెన్ పోటీల్లో పల్నాడు జిల్లా వాసులు ప్రతిభ కనపరిచి రెండు బంగారు, ఐదు వెండి, ఒక బ్రాంజ్ సాధించినట్లు పల్నాడు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి పసుపులేటి సురేష్ సోమవారం తెలిపారు. నెల్లూరు ఏసీ రెడ్డి స్పోర్ట్స్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ అండ్ బెంచ్ ప్రెస్ సీనియర్ మెన్, ఉమెన్ పోటీల్లో పల్నాడు జిల్లాకు చెందిన ఆరుగురు క్రీడాకారులు ఈ బహుమతులు సాధించారన్నారు. పల్నాడు జిల్లా మెన్‌టీమ్ చాంపియన్‌షిప్ రెండో స్థానంతో పాటుగా పసుపులేటి వంశీకృష్ణ రాష్ట్రస్థాయిలో స్ట్రాంగ్‌మెన్‌గా రెండో స్థానం సాధించినట్లు వివరించారు. సీనియర్ విభాగంలో 53 కేజీల విభాగంలో రొంపిచర్లకు చెందిన ఎం.అనూష బంగారు పతకం, సిల్వర్ పతకం సాధించగా, 66 కేజీల విభాగంలో దాచేపల్లి మండలం పెదగార్లపాడుకు చెందిన ఎం.అశోక్‌కుమార్ బంగారు పతకం సాధించారన్నారు. 74 కేజీల విభాగంలో సత్తెనపల్లికి చెందిన పసుపులేటి వంశీకృష్ణ సిల్వర్, 83 కేజీల విభాగంలో సత్తెనపల్లికి చెందిన ఎస్.కె.నజీర్ బ్రాంజ్ సాధించారు. 120 కేజీల విభాగంలో గుడిపూడికి చెందిన లింగిశెట్టి శివనాగేశ్వరరావు 2 సిల్వర్ పతకాలు సాధించారన్నారు. విజేతలను రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, పల్నాడు జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జిమ్ రాజు, వైస్ ప్రెసిడెంట్ గుజ్జర్లపూడి ఆనంద్, ఎస్.మణిరత్నం, టి.శంకర్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాతంగి సాంబశివరావు, కత్తి పవన్, మాతంగి రాహుల్ గౌతమ్, జి.రమేష్, శాంతయ్య, ఎస్కేజానీ, సయ్యద్ మస్తాన్ అభినందించారు.

గోదాముకు చేరిన ఎన్నికల వీవీ ప్యాడ్‌లు

పరిశీలించిన జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: వచ్చే ఏడాది నిర్వహించే రాష్ట్ర అసెంబ్లీ, పార్లమెంటు స్థానాల ఎన్నికల్లో ఉపయోగించే వీవీ ప్యాడ్‌లు సోమవారం నరసరావుపేటకు చేరాయి. భారత ఎన్నికల సంఘం పల్నాడు జిల్లాకు కేటాయించిన ఈవీఎం, వీవీ ప్యాడ్‌లను భద్రపరచే కార్యక్రమాన్ని కలెక్టర్ ఎల్ శివశంకర్ పరిశీలించారు. పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు చెందిన ఏడో నంబరు గోదామును వీటికోసం కేటాయించారు. సోమవారం బెంగళూరు బెల్ కంపెనీ నుంచి లారీలో వచ్చిన 5920 వీవీ ప్యాడ్లను కలెక్టర్, అధికారులు, రాజకీయ ప్రతినిధుల సమక్షంలో స్వాధీనం చేసుకొని నిర్దేశించిన గోదాములో భద్రపర్చారు. తొలుత గోదాము వద్దకు ఉదయమే చేరుకొని పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి, తహసీల్దార్ ఆర్‌వీ రమణానాయక్, కలెక్టరేట్ ఎస్.ఓ యశోద, వైఎస్సార్ సీపీ, బహుజన సమాజ్ పార్టీ, సీపీఎం ప్రతినిధులు ఖాన్, బాబురావు, వినయ్ కుమార్ పాల్గొన్నారు.



గోదాములో భద్రపరిచిన వీవీ ప్యాడ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్ తదితరులు

పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ

ఏఎన్‌యూ: యూనివర్సిటీలో విద్య, పరిశోధనాంశాలతోపాటు విద్యార్థులకు నిరంతరం సివిల్స్ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నామన్నామని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఏఎన్‌యూలో సోమవారం జరిగిన యూనివర్సిటీ 87వ అకడమిక్ సెనెట్ సమావేశంలో వీసీ యూనివర్సిటీ సమగ్రాభివృద్ధి నివేదికను సమర్పించారు. రానున్న రోజుల్లో చేపట్టనున్న అంశాలను ప్రతిపాదించారు. పలు అంశాలకు అకడమిక్ సెనెట్ ఆమోదం తెలిపింది. ఈ ఏడాది ఆగస్టు చివరి వారంలో యూనివర్సిటీ 39, 40వ స్నాతకోత్సవాలు కలిపి నిర్వహించే అంశానికి అకడమిక్ సెనెట్ ఆమోదం తెలిపింది. సెప్టెంబర్ 11న విశ్వవిద్యాలయ ఆవిర్భావ దినోత్సవం జరపాలని నిర్ణయించారు. త్వరలో జరగబోతున్న నాక్ బృందం సందర్శనను సమష్టిగా విజయవంతం చేసి యూనివర్సిటీకి అత్యుత్తమ గ్రేడ్ తెచ్చేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. రెక్టార్ పి.వర ప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ, మాజీ వీసీలు బి.బాలమోహన్‌దాస్, కె.వియన్నారావు, అకడమిక్ డీన్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అండర్-7 చెస్ విజేతలు మౌళి, హర్ష

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గుజ్జనగుండ్లలోని గ్రీన్‌ల్యాండ్ స్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-7 ఓపెన్ బాల బాలికల చెస్ పోటీల్లో బాలురల్లో ఎం.శశాంక్ మౌలా, కె.హర్ష, బాలికల్లో ఎఎస్ఎస్ఎస్ కావ్య, జి.హర్షిణిలు ప్రథమ, ద్వితీయ స్థానాలు గెలుపొందారని పోటీల నిర్వాహకురాలు షేక్ పర్వీన్ తెలిపారు. ఎంపికైన నలుగురిని ఈ నెల 28 నుంచి 30 వరకు విజయనగరంలో జరగనున్న రాష్ట్ర పోటీలకు పంపిస్తామని చెప్పారు. అనంతరం విజేతలకు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు సి.హెచ్ రవీంద్రరాజు, స్కూల్ ప్రిన్సిపల్ వైఎస్ రాజు అందజేశారు.

ఉల్లిపాయల మాటున.. మద్యం ఘాటు!

- ఎనిమిది లక్షల గోవా మద్యం పట్టివేత
- ముగ్గురి అరెస్ట్
- భారీగా మద్యం సీసాలు స్వాధీనం

నగరంపాలెం: లక్షలు ఖరీదు చేసే మద్యం సీసాలను పొరుగు రాష్ట్రం నుంచి తీసుకొచ్చి, అధిక ధరలకు విక్రయించే ముగ్గురిని ఎస్ఈబీ(సెబ్) గుంటూరు-2 స్టేషన్, డీఎస్ఈఓ పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.8 లక్షలు ఖరీదు చేసే 1,042 ఫుల్ బాటిల్ సీసాలను, లారీని సీజ్ చేశారు. ఇన్నర్‌రింగ్ రోడ్‌లోని సెబ్-2 స్టేషన్ లో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను గుంటూరు ఏఎస్పీ డీఎన్ మహేష్ వెల్లడించారు. ఏఎస్పీ మాట్లాడుతూ ముందస్తు సమాచారంతో ఆదివారం మేడికొండూరు ఎస్ఎస్‌పీ కెనాల్ వద్ద ఎస్ఈబీ-2, డీఎస్ఈఓ పోలీసులు మకాం వేశారు. మేడికొండూరు నుంచి గుంటూరు వైపు వస్తున్న లారీని గుర్తించి నిలిపివేశారు. లారీలో ఉల్లిపాయలు ఉండగా, వాటి కింద పెద్ద అట్టపెట్టెలను గమనించారు. వీటిల్లో 87 అట్టపెట్టెల్లో 1,042 ఫుల్ బాటిల్ మద్యం సీసాలను గుర్తించి, గుంటూరు మోతీలాల్ నగర్ ఒకటో వీధిలో ఉంటున్న ఉదయగిరి ప్రసాద్ అలియాస్ శివప్రసాద్, శివనాగరాజుకాలనీలో ఉంటున్న చేబ్రోలు మండలం గుండావరం గ్రామ వాసి టి.బాజీబాబు, పల్నాడు జిల్లా మాచర్ల 11వ వార్డుకి చెందిన బండ్ల సత్యనారాయణను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో నేరం రుజువు కావడంతో రూ.8 లక్షలు విలువ చేసే గోవా మద్యం సీసాలను, లారీని సీజ్ చేసినట్లు ఏఎస్పీ చెప్పారు.

గత అయిదారు నెలలుగా ఉదయగిరి ప్రసాద్ అలియాస్ శివప్రసాద్ అనధికార మద్యం విక్రయాలు చేసేవాడని పోలీసులు గుర్తించారు. సొంత పెట్టుబడితో మద్యం కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. శివప్రసాద్‌కు వరుసైన బావమరిది సత్యనారాయణ, టి.బాజీబాబులు సహాయకులుగా పనిచేసేవారు. పలువురికి మద్యం సీసాలను విక్రయించే వారు. గతంలో శివప్రసాద్‌పై ప్రకాశం జిల్లాలో ఒక కేసు నమోదై ఉందని ఏఎస్పీ చెప్పారు. తక్కువ వ్యవధిలో ఎక్కువ సొమ్ము సంపాదించాలనే దురాశతో పొరుగు రాష్ట్రం మద్యం సీసాలను తీసుకొచ్చి, విక్రయిస్తున్నట్లు చెప్పారు. పొరుగు రాష్ట్రాల మద్యం ఇక్కడ విక్రయించడం చట్టరీత్యా నేరమని అన్నారు. కేసులో ప్రతిభ చూపిన సెబ్-2, డీఎస్ఈఓ సిబ్బందిని ఏఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఎస్.అన్నపూర్ణ, ఏఈఎస్ కె.మణికంట, సీఐ కె.కర్ణ (సెబ్-2), ఎస్ఐ ఇ.కల్యాణ చక్రవర్తి, హెచ్‌సీ పీవీ.పోతురాజు, కానిస్టేబుళ్లు కె.నాగరాజు, బి.వీరాంజనేయులు, కె.పూర్ణచంద్రరావు, డి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఈబీ ఏఎస్పీ మహేష్, పక్కన సూపరింటెండెంట్ అన్నపూర్ణ

రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



ఆంధ్ర కబడ్డీ సంఘం అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు

బాపట్ల అర్బన్: బాపట్ల సూర్యలంక రోడ్డులోని లోటస్ పాండ్‌లో రాష్ట్ర కబడ్డీ సంఘం అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక సోమవారం జరిగింది. ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ తాతా బసవ శంకర్ ఆధ్వర్యంలో నూతన కమిటీ అధ్యక్షుడిగా కె.ఈ.జగదీష్, వైస్ ప్రెసిడెంట్స్‌గా ఎస్.గోవర్ధన్ రెడ్డి, రామిరెడ్డి విజయభాన్ రెడ్డి, ఎస్.రామచంద్రుడు, చిరంజీవి, ఉపాధ్యక్షుడిగా కె.సి.మాధవ మూర్తి, కార్యదర్శిగా పి.పద్మజాబాల, కోశాధికారిగా మంజుల వెంకటేష్, జాయింట్ సెక్రెటరీలుగా ఆర్.రామ్ తేజ్ గౌడ్, జనార్దన్ రావు, ఎస్.యానరాజు, డి. నాగాంజనేయరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా అనగాని సురేష్, కార్యనిర్వాహక సభ్యులుగా ఆర్.గౌడ్, వై. దూర చంద్రరావు, ఆర్.నాగేశ్వరరావు, పి.కోటేశ్వరరావు, పి.దుర్గ అజయ్ కుమార్, ఎం.గంగాధర్, జె.విజయ్ ఆనందం, ఆర్.సుధాకర్‌లు ఎన్నికయ్యారు.

తగిన డాక్యుమెంట్లు సమర్పించాలి

తాడికొండ: పట్టా భూమి, అసైన్డ్ భూములకు సంబంధించి అర్హత ఉండి కౌలు చెల్లింపులు జరగని రైతులకు కౌలు చెల్లింపులు చేసేందుకు తగిన డాక్యుమెంట్లు సంబంధిత గ్రామాల కాంపిటెంట్ అథారిటీలో అందజేయాలని ఏపీ సీఆర్డీయే అడిషనల్ కమిషనర్ కట్టా సింహాచలం సూచించారు. సోమవారం తుళ్లూరు ఏపీ సీఆర్డీయే కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ ఓఎంపీ చిరంజీవితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టా భూములకు సంబంధించి కోర్టు కేసులు లేకుండా అర్హత ఉన్న రైతులు, అసైన్డ్ భూములకు సంబంధించి ఎలాంటి వివాదాలు లేకుండా క్లియర్ కేసులకు సంబంధించి తగిన ప్రతిపాదనలు నాలుగు రోజుల్లోగా విజయవాడ కమిషనర్ కార్యాలయానికి పంపించాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇందుకోసం సంబంధిత గ్రామాల కాంపిటెంట్ అథారిటీలో తగిన సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని, ఉదయం 6-8 గంటల వరకు అందుబాటులో ఉండి పెండింగ్‌లు క్లియర్ చేస్తారు. కనుక రైతులు సంబంధిత కార్యాలయాల్లో తగిన ఆధారాలు అందజేయాలని సూచించారు.